

హోమియోపతి పితామహుడు హానెమన్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

హోమియోపతి పితామహుడు హానెమన్ జయంతి అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హోమియోపతి వైద్యులు డాక్టర్ సలాది సూర్యకిరణ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందు గాడత తగ్గే కొద్ది దాని సామర్థ్యం పెరుగుతుందనే నూతన సిద్ధాంతంతో హోమియో మందును కనుగొన్నారని అన్నారు. అనంతరం అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ సూర్యకిరణ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, ప్రసాద్ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, ఎస్.శ్రీనగేష్, కొమ్మూరి శ్రీనివాసరావు, రాజా పాల్గొన్నారు.

గ్యాస్ భారం మోయలేం..

- గ్యాస్ ధర పెంపుపై ప్రజల ఆగ్రహం
- జిల్లాలో ప్రజలపై రూ.3.75 కోట్ల భారం



ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులపై మళ్లీ భారం మోపింది. ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 మేర ధరలు పెంచుతున్నట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.840 నుంచి రూ.890కు చేరింది. డెలివరీ బోయ్ ఛార్జీలు రూ.30 కలిపి వినియోగదారులు రూ.920 చెల్లించాల్సి ఉంది. ఆయిల్ కంపెనీలు ధరల పెంపుపై ప్రభుత్వ నియంత్రణను రద్దు చేయటంతో అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, గ్యాస్ ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతి నెలా వంట గ్యాస్‌పై క్రమం తప్పక రూ.25 చొప్పున పెంచిన విషయం విదితమే. కొంత కాలం వ్యవధి అనంతరం తాజాగా రెట్టింపు ధర పెంచడం కొనుగోలుదారులను కలవరానికి గురి చేస్తోంది. మోడీ ప్రభుత్వం తీరుపై వినియోగదారులలో అసహనం వ్యక్తం మవుతోంది. ధరలు నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు ధర్నా చేపట్టారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 16.77 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో గృహావసరాల వినియోగదారులు 13 లక్షల మంది ఉన్నారు. మరో 2 లక్షల మంది వాణిజ్య సిలిండర్‌ల వినియోగదారులు, మిగిలిన వారు ఉజ్వల పథకం లబ్ధిదారులు ఉన్నారు. నెలలో దాదాపు 7.50 లక్షల గ్యాస్ సిలెండర్ల వినియోగం ఉంటుందని ఒక అంచనా. గ్యాస్ సిలిండర్ ధరలను ఆయిల్ కంపెనీలు అమాంతం పెంచేస్తున్నాయి. వంట గ్యాస్‌పై మరో రూ.50 పెరగడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వాణిజ్య సిలిండర్‌ల ధర పెంపు చిరు వ్యాపారులకు గోరు చుట్టుపై రోకలి పోటు చందంగా పరిస్థితి తయారైందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గ్యాస్ ధరలు పెంచేయడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని సామాన్యులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

జిల్లాలోని ప్రజలపై రూ.3.75 కోట్ల అదనపు భారం

జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై నెలకు రూ.3.75 కోట్ల అదనపు భారం పడుతోంది. 2019 ఏప్రిల్ నుంచి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అప్పుడు రూ.734 ఉండగా 2020 మార్చిలో 839, 2021 అక్టోబర్ నాటికి 930కి పెరిగింది. 2022లో మూడుసార్లు, 23లో నాలుగుసార్లు, 2024లో ఆరుసార్లు చొప్పున ధరలు పెరిగాయి. ఎన్నికల ముందు స్వల్పంగా ధరలు తగ్గించిన కేంద్ర ప్రభుత్వం మరోసారి గుదిబండ మోపింది. తాజా పెంపుతో గ్యాస్ ధర రూ.890కి చేరింది. మరోవైపు సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో డెలివరీ ఛార్జీలు ఒకొక్క ప్రాంతంలో ఒకొక్క విధంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం రూ.30 మాత్రమే వసూలు చేయాలి. క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రూ.50 నుంచి రూ.60 వరకూ వసూలు జరుగుతోంది.

ధరలను నియంత్రించాలి

ప్రతి ఇంటికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు వాగ్దానాలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం మూడు మాత్రమే నంటూ మాట మార్చారు. అవి కూడా నిబంధన పేరుతో కొందరికే పరిమితం చేశారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చైనా రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టి ప్రజలకు భరోసా కల్పించాలి.

- జి.దుర్గ, కాతేరు, రాజమహేంద్రవరం రూరల్

సామాన్యులపై మోయలేని భారం

సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు ఉచిత గ్యాస్ సిలిండర్లు అంటూ హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనల సాకుతో మంగళం పలికారు. ఇప్పటికే నిత్యావసరాలు భగ్గుమంటున్నాయి. ధరల నియంత్రణకు ఎటువంటి చర్యలూ లేవు. ఫలితంగా రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా ధరల పెంపు వంటింట్లో చిచ్చుపెడుతోంది. ప్రభుత్వం గ్యాస్ ధర పెంపుపై పునరాలోచించాలి.

- కె.ఝాన్సీ లక్ష్మి, సీతంపేట, గృహిణి.

ఈ భారాలు మోయలేం...

ఒక పక్క విద్యుత్ ఛార్జీలను పెంచేస్తున్నారు. మరో పక్క పెట్రోలు ఛార్జీలూ అదే బాట పట్టాయి. ఇప్పుడు కొత్తగా గ్యాస్ బండపై మరో రూ.50 భారం వేశారు. ఈ భారాలు మోసే స్థితిలో లేము. వెంటనే గ్యాస్ ధరను తగ్గించాలి. ధరల పెరుగుదలతో కుటుంబ పోషణ ఇప్పటికే కష్టంగా మారింది. సామాన్యులు అన్నం తినే పరిస్థితి కూడా లేకుండా ఉంది.

- యు.శాంతిసరస్వతి, ఆదర్శ్, నగర్, రాజమహేంద్రవరం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది జవహర్ ఆలీ

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ ఉల్లంఘన

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వం తాజాగా పార్లమెంటులో ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ ఉల్లంఘనే అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'వక్ఫ్ చట్ట సవరణ - మైనారిటీలపై మరోదాడి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది జవహర్ అలీ మాట్లాడారు. వక్ఫ్ చట్టంలో 44 సెక్షన్లు సవరించారని తెలిపారు. బిజెపి ఈ చట్ట సవరణ గురించి గొప్పగా చెబుతూ ప్రజలను ప్రక్కదోవ పట్టిస్తుందని అన్నారు. వక్ఫ్ అనేది స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అని ఆయన గుర్తు చేశారు. బిజెపి చర్యలు మైనారిటీల లక్ష్యంగా ఉన్నట్లు కనపడుతున్నప్పటికీ అంతిమంగా రాజ్యాంగంపై జరుగుతున్న దాడిగా చూడాలన్నారు. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు సిహెచ్.నాగేశ్వరరావు, గొడుగు సత్యనారాయణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు జె.వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు బషీర్, హ్యూమన్ రైట్స్ ఫోరం నాయకులు ఇక్బాల్, సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు, ఐఎన్‌టియుసి నాయకులు తాళ్ళూరి రాజు, రిపబ్లికన్ పార్టీ నాయకులు పిట్టా వరప్రసాద్ తదితరులు మాట్లాడారు. రాజ్యాంగ పరిషత్తులో చర్చల సందర్భంగా అంబేద్కర్ ప్రజాస్వామ్యం గురించి వివరించారని అన్నారు. మైనారిటీ హక్కుల రక్షణే ప్రజాస్వామ్యంలో కీలకమని చెప్పిన విషయాన్ని గమనించాలన్నారు. వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగంపై జరుగుతున్న దాడిగా చూడాలన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం

విస్తృత ప్రజాసమీకరణతో బిజెపి విధానాలను తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. దేశంలో రైతాంగ ఉద్యమమే మోడీ మెడలు వంచిన విషయాన్ని గమనించాలన్నారు. అదే స్ఫూర్తితో ప్రజలంతా వివిధ సంఘాల ద్వారా ఏకమై రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, బిజెపిని గద్దె దించాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జీ మాట్లాడుతూ బిజెపి దాడి ముస్లింలతో ఆగదని యావత్ కష్టజీవుల హక్కులను హరిస్తుందన్నారు. తద్వారా కార్పోరేట్‌లకు దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు వందన సమర్పణ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బి.జయప్రకాష్, ఎస్ఐఒ నాయకులు షేక్ జియావుద్దీన్, జానీ, ఆవాజ్ నాయకులు ఇబ్రహీం, సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిహెచ్.రమణి, కెఎస్ శ్రీనివాస్, మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకట రమణ, కె.నాగజ్యోతి, దుర్గారావు, మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 16వ వార్షికోత్సవం ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెడి డాక్టర్ ఎస్.శోభారాణి, విజయ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.విజయబాబు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వారిలోని సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు, బెట్టింగ్ యాప్‌లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు వి.రామారావు, కె.సురేష్, ఎస్‌కె.మదీనా, ఎం.వీరభద్రరావు, డాక్టర్ బంగారు రాజు, పుష్ప, కుమారి, మేరీ రోజలినా, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఆర్‌జెడి

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జడ్.రాగంపేటకు చెందిన బొడ్డు వెంకటశ్రీనివాస్‌కు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం రూ.7,83,346 చెక్కును గురువారం ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని బాధితులు సాయం కోసం సిఎంఆర్ఎఫ్ సాయం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, కందుల కొండయ్య చౌదరి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పెద్దాపురం



నియామక పత్రాలతో నూతన కమిటీ సభ్యులు

పెద్దాపురం సమితి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జగన్నాథం, జనరల్ సెక్రటరీ జ్యోతుల రాంబాబు, అసోసియేట్ అధ్యక్షులు రత్నరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులుగా ఎన్‌వివి.ప్రసాద్, కార్యదర్శిగా టి.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షులుగా బి.ప్రకాష్‌రావు, కోశాధికారిగా జి.రాజా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.అభిషేక్, ఉపాధ్యక్షులుగా ఎస్.సంజీవ్‌కుమార్, ఎస్.మహేష్ బాబు, లోవరాజు, కె.వీరబాబు, బి.ఈశ్వరరావు, కె.సుష్మన్, బి.రఘుశ్రావంతి, సహాయ కార్యదర్శులుగా కె.సింధు, వి.రామ తులసి, ఎం.సతీష్‌కుమార్, టి.విజయ్ కుమార్, వి.సంతోషిఅపర్ణ, పి.సుజాత, శ్రీదేవి ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

రాయబార కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 24న చేపట్టబోయే డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఇంటి వద్ద జరిగే చలో పిఠాపురం సామూహిక రాయబార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నందూరి ప్రసాదరావు భవనంలో సామూహిక రాయబార కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు కరణం విశ్వనాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం నిర్మాణ రంగ కార్మికులకు అన్యాయం చేసిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డ్‌ను పునరుద్ధరిస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేడు అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. తక్షణమే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లెయిమ్ విడుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సెస్ నిధులను కార్మిక సంక్షేమానికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు నుంచి గత ప్రభుత్వాలు తీసుకున్న నిధులను తిరిగి జమ చేయాలని, అర్హులైన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఇంటి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24న పవన్ కల్యాణ్ గృహానికి చేపట్టిన సామూహిక రాయబార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పప్పుల వీరబాబు, ఎం.సత్తిబాబు, ఎం.సూరిబాబు, జి.సత్తిరెడ్డి, ఉమ్మి గోవిందు, డి.గోపాలకృష్ణ, పి.కృపా పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక నేతలు

మజ్జిగ చలివేంద్రాలు పారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలేశ్వరం ఎండతీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్.విజయబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఏలేశ్వరంకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గోళ్ళ నాగేశ్వరరావు, జ్యోతుల నాగసత్యశ్రీనివాస్, కరోతు సత్యనారాయణ, వరపుల చిట్టిబాబు, తాళ్లూరి గొల్లాజిరావు, తిరగటి సత్యనారాయణ, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు, సిరి ఫుడ్స్ కృష్ణ పాల్గొన్నారు. అలాగే **పెద్దాపురం** పట్టణంలోని పలు ప్రాంతాల్లో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక డైలీ మార్కెట్ సెంటర్ వద్ద జైన్ సంఘం ఆధ్వర్యంలోనూ, మరిడమ్మ ఆలయం వద్ద దేవస్థానం ఎసి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాలు నిర్వహించారు. **పిఠాపురం** కుమారపురం గ్రామంలో సచివాలయ సర్వేయర్లు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వహకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లిలో..మండలంలోని బొర్రంపాలెం 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో హెచ్‌టి, వ్యవసాయ కనెక్షన్‌లకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని విద్యుత్ శాఖ ఎఇ కిరణ్‌కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కాట్రావులపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ ఫీడర్‌పై చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గండేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని ఎన్‌టి.రాజాపురం ఫీడర్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. **సామర్లకోటలో...**పట్టణంలోని 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం సామర్లకోట, పెద్దాపురం మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్టు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. **పిఠాపురంలో..**11 కెవి ఫీడర్ మెయింటినెన్స్‌లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఎఇఇ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నర్సింగపురం, జములపల్లి, కోలంక, కుమారపురం, ఫక్రుద్దీన్‌పాలెం, కందరాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జాతి నిర్మాణంలో బ్యాంకులది కీలక పాత్ర

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం కావడానికి బ్యాంకులు ఎంతగానో దోహదపడుతున్నాయని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సీనియర్ ప్రాంతీయ మేనేజర్ బిజయ్‌కేతన్ సాహు అన్నారు. స్థానిక రమణయ్యపేటలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పెనుమర్తి శాఖ ఆధునీకరణ అనంతరం బ్రాంచ్‌ను కేతన్ షాహు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వయం శక్తి సంఘాలకు, వ్యవసాయానికి, గృహ నిర్మాణానికి, విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తున్నాయని అన్నారు. చిన్న, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమలు, ఉపాధి కల్పన వంటి పథకాలకు కూడా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తూ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా కేతన్ సాహును ఖాతాదారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, ఎజి ఎస్‌బి.శివరామకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ బి.ఫణీంద్ర, ఇతర బ్రాంచ్‌ల మేనేజర్లు కెవివి.ప్రసాద్, రవికుమార్, శివగణేష్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న విజయ్‌కేతన్

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన


ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సింగరంపాలెం గ్రామంలో రూ.3.29 కోట్లతో చేపట్టే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహనరావు తండ్రి పోతుల వీర్రాజు జ్ఞాపకార్థం ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని ప్రభుత్వానికి దానం చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మండలంలో మొత్తం 7 సబ్ స్టేషన్‌లు ఉండగా వాటిలో 6 సబ్‌స్టేషన్లను టిడిపి పాలనలోనే నిర్మించడం జరిగిందన్నారు. ప్రస్తుతం చేపట్టిన సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల సింగరంపాలెం, రామయ్యపాలెం, ఎన్‌టి రాజాపురం గ్రామాల్లో ఉన్న 400 బోర్లకు సవవృద్ధిగా విద్యుత్ సరఫరా అవుతుందని, గృహాలకు వోల్టేజ్ సమస్య తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చలగల్ల దొరబాబు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ గొర్ల ప్రసాద్, ఇఇ బలబద్రపు వీరభద్రరావు, డిఇఇలు కె.మలాకి, బి.జ్యోతి, ఎఇ ఎస్.కిరణ్‌కుమార్, నాయకులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్‌విఎస్.అప్పలరాజు, కోర్పు సాయితేజ, అడబాల భాస్కరరావు, కొత్త కొండబాబు, కుంచె రాజా, కందుల చిట్టిబాబు పాల్గొన్నారు..



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

కార్టూ'నిజం'



పలువురిని సత్కరించిన రైతులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రబీలో నీటి ఎద్దడి లేకుండా కృషి చేసిన నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది, సాగునీటి సంఘాల ప్రతినిధులను రైతులు సత్కరించారు. మండలంలోని పి.మల్లవరం గ్రాంటు ప్రాంతంలో ఈ ఏడాది నీటి ఎద్దడి తలెత్తింది. దీనిపై డిఇ పోచారావు, ఎఇ అనూష కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒఎన్‌జిసి పైపులైన్ ద్వారా సాగునీటిని, టేకి, ఆత్రేయ డ్రైన్ మిగులు జలాలను పంపింగ్ చేసి గ్రాంటు ప్రాంతంలోని ఆయకట్టును కాపాడారు. దీనికి కృతజ్ఞతగా రైతులు గురువారం ఇరిగేషన్ అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వేగేశ్నభాస్కరరాజు మాట్లాడుతూ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు కృషితో కొంత మేరకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. వచ్చే ఏడాది రబీ నాటికి ఇంజరం వంతెన పూర్తి చేసి నీటి ఎద్దడి సమస్యను నివారిస్తామన్నారు. అనంతరం రైతు నాయకులు సూరంపూడి శ్రీను అధ్యక్షతన నీటి సంఘం డైరెక్టర్లు పేరాబత్తుల సాయి, రాయుడు వీర్రాజు, బాదం వీర వెంకట సత్యనారాయణ, రైతులు పితాని సత్తిబాబు, బాదం ఏడుకొండలు, కావూరి వెంకన్న, పితాని రామకష్ణ అధికారులను సత్కరించారు.



సభలో మాట్లాడుతున్న రైతు శ్రీను

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో గురువారం స్థానిక చాచా విద్యా నికేతన్ 8వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రంలో విద్యుత్ ప్రవాహం వల్ల కలిగే రసాయన ఫలితం పాఠ్యాంశం కు సంబంధించిన అనేక ప్రయోగాలు విద్యార్థులతో చేయించారు.



వివరాలను తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన జెసి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా గురువారం సందర్శించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ధాన్యం కొనుగోలు సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యంను అమ్మకం చేయాలని మైకులు, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రైతులు మద్దతు ధర కన్నా తక్కువకు అమ్మకం చేపట్టవద్దని తెలిపారు. రైతులకు అవసరమైన గోనె సంచులు సకాలంలో కొనుగోలు కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా సివిల్ సప్లై అధికారి ఎండి.నాయక్, డిఇఒ మురళీకృష్ణ, తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, సొసైటీ సెక్రటరీ ఎ.సూరిబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

15 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - కరప

మండలంలోని రబీలో సాగు చేసిన వరి పంటను కొనుగోలు చేసేందుకు 15 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు సేవ కేంద్రంలో ధాన్యం కొనుగోలు సిబ్బంది గ్రామ వ్యవసాయ సహాయకుల పర్యవేక్షణలో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులందరికీ కనీస మద్దతు ధర కామన్ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కి రూ.2300 లేదా 75 కేజీలు బస్తాలకు రూ.1725, గ్రేడ్ ఎ రకానికి క్వింటాల్‌కు రూ.2320, 75 కేజీలు బస్తాకు రూ.1740 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. గోనెసంచులు, హమాలీ, రవాణాను రైతులు ఏర్పాటు చేసుకుంటే అందుకయ్యే ఖర్చును ప్రభుత్వం సంబంధిత రైతు ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19న రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 19న రన్ పర్ జీసస్ నిర్వహించబడుతుందని రన్ ఫర్ జీసస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ లంక పురుషోత్తమ దాస్ తెలిపారు. గురువారం రన్ ఫర్ జీసస్ టీ షర్ట్స్, క్యాప్స్, జండాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ తేదీ ఉదయం 6 గంటలకు స్థానిక లూథరన్ హైస్కూల్ నుంచి ప్రారంభమయ్యే రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో సేవకులు, క్రైస్తవ సమాజం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కోఆర్డినేటర్స్ సుకుమార్, డి.వెంకట్‌పాల్, కె.నాగ శ్రీనివాస్ జిమ్స్, చందు స్టీఫెన్, తలారి విజయ్‌కుమార్, ఎన్.ఇమ్మానియేల్ సహాయం, పల్లా చిన్ని పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాడపల్లిలో బంగారం చోరీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి బీరువాలో ఉన్న బంగారం దొంగిలించిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన కప్పల సత్తిపండు పూల వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 8న రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సమేతంగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి కళ్యాణం చూడ్డానికి వెళ్లారు. కళ్యాణం అనంతరం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తీసి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలో ఉన్న 4 కాసుల బంగారం లేకపోవడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని భావించి స్థానిక స్టేషన్‌లో సత్తిపండు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ ఎస్‌.రాము గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి కిడ్నాప్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - రావులపాలెం

మండల కేంద్రం రావులపాలెం లో వ్యక్తి కిడ్నాప్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.వి. రమణారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఆదిలక్ష్మి నగర్ ఐదవ వీధికి చెందిన సిరంగం మురళీధర సుబ్బారావు ఈ నెల 9నవ అర్ధరాత్రి మోటార్ సైకిల్ పై వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన సంజు అనుచరులు సంజయ్, రమేష్, గోపయ్య కారుపై వచ్చి గంటి గ్రామానికి చెందిన రుద్ర సురేష్ ద్వారా వచ్చి సుబ్బారావును కిడ్నాప్ చేశారన్నారు. సుబ్బారావును మహారాష్ట్ర తీసుకెళ్లారన్నారు. వ్యాపార లావాదేవీలు కారణంగానే ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు సుబ్బారావు కుమారుడు సిరంగం శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళపై మాజీ రౌడీ షీటర్ దాడి

పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం నల్ల వంతెన రజక పేటకు చెందిన టేకు వెంకటలక్ష్మిపై మాజీ రౌడీషీటర్, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ అతని అనుచరులు కత్తులతో దాడి చేశారు. ఈ ఘటన ఈనెల మూడో తేదీ గురువారం రాత్రి 10 గంటలకు చోటు చేసుకుంది. ఈ మేరకు విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణతో కలిసి బాధితురాలు గురువారం డిఎస్‌పి కలిసి ఫిర్యాదు చేసింది. మా ఇంట్లో అద్దెకు ఉంటున్న తోలేటి ఓంప్రకాష్ కోసం దున్నాల దుర్గ అతని అనుచరులు ఇంటికి వచ్చి వీరంగం చేశారు. 'మీకు ఎమన్నా గొడవలు ఉంటే బయట చూసుకోవాలి' అని బేటు వెంకటలక్ష్మి వారికి చెప్పింది. దీంతో 'కులం తక్కువ దాన నువ్వు మాకు చెప్పేవా అంటూ' దున్నాల దుర్గపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఇంటిలో బయటకు వచ్చిన తోలేటి ఓంప్రకాష్‌పైనా వారు దాడికి దిగారు. అతనిపై ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోక లేదని ఆరోపించారు. పలుకుబడి ఉపయోగించి కేసు నుంచి దున్నాల దుర్గను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. తనపై దాడి చేసిన దున్నాల దుర్గ, దుర్గ దివీప్, కంచిపల్లి శ్రీను, జక్కపు ప్రసాద్, ఏలూరి అయ్యప్పలపై కేసు నమోదు చేయాలని కోరింది.

వ్యక్తి మృతికి కారణమైన వారికి రిమాండ్

ప్రజాశక్తి-చాగల్లు

ఊనగట్ల గ్రామంలో గత నెల 29న ఒక వ్యక్తి మృతికి కారణమైన వారికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. బోనం సుబ్బారావు(54)ను పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన ధూపాటి శ్రీనివాస్, అతని కుమారుడు సత్యనారాయణ చేతులతో కొట్టి గెంటి వేయగా, సిమెంటు రోడ్డుపై పడడం వల్ల సుబ్బారావు తలకు గాయంతో మరణించారు. ఈ కేసులో నిందితులను కొవ్వూరు రూరల్ సిఐ కె.విజయ్ బాబు అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరం గ్రామం చెరువు మలుపు వద్ద గురువారం ఒక ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ సహా నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రయాణికులు కాతేరు గ్రామం నుండి చినకొండేపూడి గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని వెంటనే అంబులెన్స్‌లో రాజమండ్రిలోని ఆసుపత్రికి తరలించారు.

జామాయిల్ తోట నరికివేతపై కేసు

ప్రజాశక్తి-గోపాలపురం

ఐదు ఎకరాలలో ఉన్న జామాయిల్ తోటను అక్రమంగా నరికి కర్రలను దొంగిలించిన 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. మండలంలోని బీమోలు గ్రామ రెవెన్యూ పరిధిలో షేక్ యాకుబ్‌కు చెందిన 5 ఎకరాలల్లో ఉన్న జామాయిల్ తోటను ఈ నెల 3న అదే గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా నరికివేసి జామాయిల్ కర్రలను అపహరించారు. దీనిపై రైతు యాకూబ్ సాహెబ్ ఫిర్యాదు మేరకు మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం రేవిన్యెడ్ కాలనీ వద్ద గల ఇటుక బట్టీలో గురువారం విషాద సంఘటన చోటు చేసుకుంది. ట్రాక్టర్ ప్రమాదవశాత్తు తిరగబడడంతో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. గ్రామానికి చెందిన సిద్ధా వెంకన్న (55) తన సొంత ఇటుక బట్టీలో ట్రాక్టర్‌తో మట్టిని తొక్కుతున్నాడు. ఈ సమయంలో అదుపు తప్పి ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకన్న ట్రాక్టర్ కింద పడిపోవడంతో తీవ్రమైన గాయాలపాలయ్యాడు. వెంటనే తోటి పనివారు స్పందించి వెంకన్నను ట్రాక్టర్ కింద నుంచి బయటకు తీశారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రిలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. వెంకన్నకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీతానగరం ఎస్‌ఐ రామ్ కుమార్ తెలిపారు.

రాజకీయ సంస్కరణల దిట్ట 'యనమల'

ప్రజాశక్తి - తుని

రాజకీయాల సంస్కరణలకు దిట్ట యనమల రామకృష్ణుడు అని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం పట్టణంలో యనమల రామకృష్ణుడు 42 వసంతాల రాజకీయ ప్రస్థాన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఎంఎల్‌ఎ యనమల దివ్య అధ్యక్షతన జరిగింది. ఈ పుస్తకాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ ఎన్‌టి.రామారావుకు, నారా చంద్రబాబు నాయుడుకు యనమల రామకృష్ణుడు వినయ, విధేయతల గల ముద్దుబిడ్డని, టిడిపికి మూల స్తంభం లాంటివాడని అన్నారు. మంత్రి కింజరాపు అచ్చె



బుక్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎంఎల్‌ఎలు

నాయుడు మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీని గాడిలో పెట్టడంలో యనమల క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. స్పీకర్‌గా, ఆర్థిక మంత్రిగా పనిచేస్తూ విధి విధానాలను రూపొందించడంలో కీలకంగా వ్యవహరించేవారని అన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మూడు రాజధానులు నిర్మాణం సరైన విధానం కాదని, దానిని అడ్డగించడంలో యనమల కీలకపాత్ర పోషించారని అన్నారు. టిడిపిలో ఎంతో మందికి యనమల రాజకీయ గురువు అని పలువురు కొనియాడారు. అనంతరం యనమల రామకృష్ణుడుని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి పార్టీ అధ్యక్షుడు పల్ల శ్రీనివాస్, ఎంపి సానా సతీష్, ఎంఎల్‌ఎలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, కింజర పచ్చినాయుడు, గోరంట్ల బుచ్చియ్య చౌదరి, పంతం నానాజీ, కూటమి నాయకులు వెలగా వెంకటకృష్ణారావు, యనమల రాజేష్, చింతమనేని అబ్బాయి, మోత్కూరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి - కరప

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఇఒలు కె.వి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ కోరారు. గురువారం మండలంలోని గురజనాపల్లిలో జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.సాయిమోహన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు,



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా యూనిసెఫ్ సహాయం ద్వారా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. 'మన బడి- మన భవిష్యత్తు' కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు వై.వేదవేణి, ఎస్‌ఎంసి చైర్మన్ పి.సూరకరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు కె.వి.రమణి, యు.రాజేష్‌కుమార్, పి.వి.రమణమూర్తి, ఉపాధ్యాయులు వి.వి.రమణ మూర్తి, టి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై సిపిఐ నిరసన

ప్రజాశక్తి - కాకినాడ, సామర్లకోట

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. గురువారం స్థానిక మదర్ థెరిస్సా సెంటర్ వద్ద జరిగిన నిరసనకు ముందుగా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు తాటిపాక మధు మాట్లాడుతూ అను వెంటనే, ఇసు కూటమి ప్రభుత్వాలు దెబ్బకు ప్రజల జీవన విధానం కుదేలైందని విమర్శించారు. మహిళలకు ఉచిత గ్యాస్ అని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి పార్టీల అధికారంలోకి వచ్చాక శ్రీరామనవమి సందర్భంగా వంట గ్యాస్‌పై



సామర్లకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులు

రూ.50 పెంచారని అన్నారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.బోడకొండ, తోకల ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎ. భవాని, నాయకులు పప్పు ఆదినారాయణ, కేశవరపు అప్పలరాజు, టి.అన్నవరం పాల్గొన్నారు. అలాగే సామర్లకోటలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన ప్రచార జాత జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాటం సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కేశవరపు అప్పలరాజు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.సూరిబాబు, మడగల రమణ, పెద్దిరెడ్డి అర్జునరావు, నమ్మి సత్య నారాయణ, అడపా చిట్టిబాబు పాల్గొన్నారు.

నేత్రాల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కాజులూరు

కళ్ళ సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయరాదని విశ్రాంత ఉపాధ్యాయులు, బుద్ధిస్ట్ గుత్తుల శ్రీరాములు అన్నారు. గురువారం మండలంలోని కోలంక బాల యువజన సంఘం పి. గుంటూరు మాణిక్యం నేత్రవైద్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో 130 మందికి పరీక్షలు నిర్వహించి 30 మందికి కళ్ళజోళ్ళు అందించి 30 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కళ్ళ సమస్యలు ఏర్పడినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రియ, డాక్టర్ చిట్టిబాబులు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో బొండా వెంకన్న, కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాణిదేవి

పోషణ పట్వాడా కార్యక్రమాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పట్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానిదేవి మాట్లాడుతూ పోషణ పట్వాడ కార్యక్రమాలు ఈ నెల 22 వరకు జరుగుతాయని తెలిపారు. పిల్లలకు 6 నెలల వరకు తల్లిపాలనే పట్టాలని, ఆహారంలో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌతులపూడిలో ముద్రగడ పర్యటన

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గిడజాంలో గురువారం వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గుమ్మరేగుల గ్రామానికి చెందిన సేనాపతి రాజబాబును పరామర్శించారు. ఈ పర్యటనలో సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, వైసిపి మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు వాసిరెడ్డి జమీలు, వాసిరెడ్డి భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

సునీల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆర్‌బి.కొత్తూరులో ఇటీవల మృతి చెందిన చెట్ల సునీల్ కుటుంబానికి ఎంపిపి డి.శ్రీలలిత తన సొంత నిధులు రూ.1 లక్షను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బి.కొత్తూరు టిడిపి నాయకులు నూనె రామారావు పాల్గొన్నారు.



హానిమన్‌కు నివాళి అర్పిస్తున్న నీలం తిలక్

ఘనంగా హానెమన్ జయంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మానవాళి మనుగడలో అనేక రోగాలకు ఆరోగ్యకరమైన శాశ్వత పరిష్కారం చూపిన డాక్టర్ హానిమన్ సేవలు స్ఫూర్తిదాయకమని హోమియో వైద్య సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ నీలం తిలక్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో డాక్టర్ హానిమన్ 270వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత హానిమన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్య రంగంలో హానిమన్ తీసుకొచ్చిన విప్లవాత్మక ఆవిష్కరణలను, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ కె.అనూరాధ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సత్యకుమార్, ఉపప్రిన్సిపల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వి.ఎస్.చౌదరి, డాక్టర్ జి.సాయిప్రసాద్, డాక్టర్ కప్పిరెడ్డి రామకృష్ణ, డాక్టర్ కె.తనూజ, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో పశువుల మందులు

ప్రజాశక్తి-సీతానగరం, కోరుకొండ

పాడి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పశువులకు అవసరమైన మందులను రైతు సేవా కేంద్రాల్లో పశు సంవర్థక శాఖ సహాయకుల వద్ద అందుబాటులో ఉంచాలని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పశు సంవర్థక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పశువులకు సకాలంలో మందులు అందుబాటులో లేవని, తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వెంటనే మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక విత్తనాల సరఫరా, పశువుల దాణా, వ్యాక్సిన్‌ల పంపిణీ వంటి అంశాలపై ఆయన సమీక్షించారు. త్వరలో రాజానగరం నియోజకవర్గంలో కొత్తగా వెటర్నరీ డిస్పెన్సరీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. తోకాడ, నరేంద్రపురం గ్రామాల్లో ఈ డిస్పెన్సరీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.



ఎంపిడిఒ నాతి బుజ్జికి మెమెంటో అందిస్తున్న కలెక్టర్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ,గండేపల్లి

వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎంపిడిఒలు, డ్వామా ఎపిఒలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల లక్ష్యసాధన, వేసవి కార్యాచరణ ప్రణాళిక, 0-6 సంవత్సరాల చిన్నారుల ఆధార్ నమోదుకు క్యాంపుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ప్రజలకు ఎటువంటి తాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా జిల్లా లోని ప్రతి ఆవాసంలో కనీసం ఒక తాగునీటి సోర్స్ ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కొన్ని గ్రామాల్లో గృహ ట్యాప్ కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుకోవడం వల్ల హైలెవల్ ప్రాంతాలు, పైపులైన్ల చివర ప్రాంతాల ప్రజలకు నీటి సమస్య ఎదురౌతున్న అంశం తన దృష్టికి వచ్చిందన్నారు. అధికంగా మోటార్లు బిగించిన నీటి ని అక్రమంగా తోడుతూ నీటి కొరతకు కారణమౌతున్న గృహాలకు పైపులైన్ల కనెక్షన్లు తక్షణం కట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏ ఆవాసంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి ఉత్పన్నం కాకూడదని, ఇందుకు ఏ పనులు అవసరమైన తక్షణం చేపట్టాలని సూచించారు. ఆక్వారైతు నిర్వాణ పనుల కారణంగా సమ్మర్ స్టోరేజ్ రిజర్వాయర్‌కు వేసవిలో నీటి విడుదల లేదని, ఈ నేపథ్యంలో అవసరం దేవ స్థానం, అన్నవరం గ్రామానికి ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ చట్టం లక్ష్య సాధనకు కృషి చేసిన మండలాల ఎంపి డిఒ, ఎపిఒలను కలెక్టర్ అభినందించారు. అన్ని సూచికల సాధనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగవ స్థానాల్లో నిలిచిన పిఠాపురం, గండేపల్లి, కాకినాడ రూరల్, ఏలేశ్వరం మండలాలకు చెందిన ఎంపిడిఒ, ఎపిఒలను ఆయన మెమెంటోలతో సత్కరించారు. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి పి.వెంకటలక్ష్మి, ఎంపిడిఒ, ఎపిఒలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న దాతలన్నపూర్ణ

బ్లూ టూత్, మైక్ సెట్ బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉచిత పాలీసెట్ శిక్షణా తరగతులకు అవసరమైన బ్లూటూత్, మైక్ సెట్‌తోపాటు, విద్యార్థులకు అవసరమైన పెన్నులను దాత దూదర్గన్ విశ్రాంత ఇంజనీర్ బొగ్గవరపు అన్నపూర్ణ బహూకరించారు. గురువారం స్థానిక యనమల సూర్యారావు భవనంలో జరుగుతున్న పాలీసెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని దాత సందర్శించారు. మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో పాలీసెట్‌పై ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా దాతను నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ, ఉపాధ్యాయులు నీలపాల బాలమురళీకృష్ణ, స్థానికులు తోట నవీనన్, బోడా చరణ్, అమృత, నవ్యత, మణికంఠ పాల్గొన్నారు.

శ్మశానం అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక పెంకేవారిపేట శ్మశాన వాటిక అభివృద్ధికి స్థానిక శ్రీ గణేష్ జ్యూయలర్స్ అధినేత మందారపు సత్తిబాబు బద్రర్ రూ.ఒక లక్ష, స్థానిక పరిశోక్కు వీధికి చెందిన దంగ వెంకటరామరాజు రూ.50 వేలు విరాళాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులకు గురువారం అందించారు. ఈ సందర్భంగా దాతలను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

E.A. 1/2025 in E.P. 44/2018 in O.S. 526/2004

Between:

చింతకాయల కాంచన మాల ...పిటీషనర్ / DHR

మరియు

కర్నాసుల శివ కుమారి & Another ...రెస్పాండెంట్స్ / JDR's

Respondent No : 2

షేక్ జమీలా, W/o. మహమ్మద్ గయాసుద్దీన్, వయస్సు 45 సం॥లు, House Wife, డో.నెం. 15-7-12, Ismail బిడ, రామకృష్ణారావు పేట, కాకినాడ - KJCJC.

పై నెంబరు లోని రెస్పాండెంట్ నెం. 2 కు, కోర్టు నుండి DHR గారు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుట వలన శ్రీ కోర్టు వారి ఆజ్ఞ ప్రకారం ఈ పేపర్ ప్రకటన ద్వారా రెస్పాండెంట్ నెం.2 అయిన మీకు నోటీసు పంపవమైనది. కనుక మీరు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని పైన తెలిపిన కోర్టు వారి ఎదుట ది. 29-4-2025 తేదీన ఉదయం గం.10-30 నిలకు హాజరై అభ్యంతరం ఏమైనా ఉన్న తెలుపగలరు, లేనిచో పై పిటీషన్ మీ పరోక్షమున కోర్టువారు తీర్మానించెదరు.

వెంకటరెడ్డి బహదూరు షా, M.A., MA, M.Ed, L.L.M. అడ్వకేట్, #8-11-5/1, గాంధీ నగర్, కాకినాడ. సెల్: 9848137399

కాకినాడ. ది. 08-04-2025

మహారాజశ్రీ రాజమండ్రి 9వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో (ఫ్యామిలీ కోర్టు)

F.C.O.P. No. 253/2024

Between:

తలుకు (కొండపల్లి) లక్ష్మీ మౌనిక, W/o. సాయి రామ్ చక్రవర్తి, రాజమండ్రి -పిటీషనరు

AND

తలుకు సాయిరామ్ చక్రవర్తి, S/o. late బాలాజీ, వయస్సు 35 సం॥లు, ఉద్యోగి, టీమ్ లీడరు, సాఫ్ట్‌వేర్ కంపెనీ, బంజారా హిల్స్, హైదరాబాదు - 533334. ప్రస్తుతం C/o. పులగట్ల శ్రీనివాస్, S/o. రాము, డోనెం. 16-210, మరనాత చెంపల్, సాఫ్రన్ బ్యూటీపార్లర్ వద్ద, కొంతమూరు, రాజమహేంద్రవరం రూరల్. -రెస్పాండెంట్

పై నెంబరు F.C.O.P. 253/2024 గ్రంధములో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా పంపిన రిజిస్ట్రరు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోవడములేదు. కావున ది. 21-4-2025వ సం॥ము తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి పై పిటీషనుకు మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున పిటీషనుకు మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

కె.వెంకటరత్నం అడ్వకేటు, రాజమండ్రి

రాజమండ్రి ది.08-4-25 సెల్: 9848449185

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో ఐ.ఎ. 43/2024, ఐ.ఎ. 40/2024 ఇన్ ఓ.యస్. 19/2022

Between:

పిటీషనరు/ వాది:

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజారు బ్రాంచ్, కొవ్వూరు, రిప్రజెంటెడ్ బై బ్రాంచ్ మేనేజరు

మరియు

రెస్పాండెంట్లు/ ప్రతివాదులు:

1. పోరా (డెడ్) ఎంటర్‌ప్రైజెస్, కొవ్వూరు దాని ప్రొ శ్రీమతి కవల సూర్యకుమారి, డోర్ నెం. 5-16-34, ఐటీ బిల్డింగ్, కొవ్వూరు మండలం, తూగోజిల్లా, కిరణ్ జెకెకి బెంటి ఏకీ.

2. శ్రీ కవల వెంకట నరసింహం, తండ్రి: లేట సూర్యనారాయణ, డోర్ నెం. 5-16-34, ఎకెకి రోడ్, కొవ్వూరు, కొవ్వూరు మండలం, తూగోజిల్లా, కిరణ్ జెకెకి బెంటి.

పై నెంబరు దావాలోను మరియు పిటీషన్ల నందు ప్రతివాదు/ రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారు సమన్లు, నోటీసులు పంపించినప్పటికిని వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకముగా తిరస్కరించుచున్నందున శ్రీ కోర్టు వారు సమన్లు, నోటీసులు అమలు పరుచుటకు ఉత్తర్వులు ఇవ్వడినందున పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ ప్రకటన ద్వారా మీకు తెలియ చేయడమైనది. కావున ది. 25-04-2025వ తేదీన ఉదయం గం. 10.30 లకు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయియున్నది. ఆరోజున మీరు స్వయంగా లేదా న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరుచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించెదరు.

వాయిదా తేది: 08-04-2025


మల్లాది వెంకట సీతారామారావు అడ్వకేట్, కొవ్వూరు

కొవ్వూరు 02-4-2025 సెల్: 9701707620

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని సిఐ జి.శ్రీనివాస్ సూచించారు. గురువారం స్థానిక గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద ద్విచక్ర వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటివి తప్పకుండా ఉండాలన్నారు. ప్రస్తుత చట్టాలు, జరిమానాలు,



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మద్యం సేవించడం, మొబైల్ డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు మణికుమార్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

E.A. 2/2025 in E.A. 13/2024 in E.P. 44/2018 in O.S. 526/2004

Between:

చింతకాయల కాంచన మాల ...పిటీషనర్ / DHR

మరియు

కర్నాసుల శివ కుమారి & Another ...రెస్పాండెంట్స్ / JDR's

Respondent No : 2

షేక్ జమీలా, W/o. మహమ్మద్ గయాసుద్దీన్, వయస్సు 45 సం॥లు, House Wife, డో.నెం. 15-7-12, Ismail బిడ, రామకృష్ణారావు పేట, కాకినాడ - KJCJC.

పై నెంబరు లోని రెస్పాండెంట్ నెం. 2 కు, కోర్టు నుండి DHR గారు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుట వలన శ్రీ కోర్టు వారి ఆజ్ఞ ప్రకారం ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు ఈ నోటీసు పంపవమైనది. కనుక మీరు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని పైన తెలిపిన కోర్టు వారి ఎదుట ది. 29-4-2025 తేదీన ఉదయం గం. 10-30 నిలకు హాజరై అభ్యంతరం ఏమైనా ఉన్న తెలుపగలరు, లేనిచో పై పిటీషన్ మీ పరోక్షమున కోర్టువారు తీర్మానించెదరు.

వెంకటరెడ్డి బహదూరు షా, M.A., MA, M.Ed, L.L.M. అడ్వకేట్, #8-11-5/1, గాంధీ నగర్, కాకినాడ. సెల్: 9848137399

కాకినాడ. ది. 08-04-2025

రీసర్వేతో రైతులకు ఊరట

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రీ సర్వే ద్వారా రైతన్నలకు తమ భూమిపై సర్వ హక్కులు రావడంతో ఊరట లభిస్తుందని తహశీల్దార్ ఆనంద్ కుమార్ అన్నారు. గురువారం మండలం లోని ఎర్రవరం గ్రామంలో జరిగిన రీ సర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి గ్రామంలో పూర్తిస్థాయిలో రీ సర్వే నిర్వహిస్తామని చెప్పారు. తమ భూమికి సంబంధించిన పత్రాలతో రైతులు సిద్ధంగా ఉండాలని సూచించారు. సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మైరాల కనకారావు, గంగిరెడ్డి మణికంఠ, ఆర్ఐ సిహెచ్.పొన్నాలు, సర్వే డిటి సంధ్య, గ్రామ కార్యదర్శి వర్మ, సర్వేయర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరం పాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మహిళా సాధికారత, విద్యుత్తుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎన్.సుబీలీ మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించడం అంటే మానవాళికి సాధికారత కల్పించడమని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు వివిధ రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ ఎం.వి.హరనాథబాబు, కె.సత్యనారాయణ, జి.నరేష్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

తూర్పుగోదావరి జిల్లా, బిక్కవోలు మండలం, మెళ్లూరు గ్రామానికి చెందిన కోసూరి కాశీ వెంకట శివరామ్ ది. 14-02-2025వ తేదీన మెళ్లూరు నుంచి బిక్కవోలు వెళ్ళుచుండగా మార్గ మధ్యంలో పాస్‌పోర్టు పడిపోయినది. నా పాస్‌పోర్ట్ నెంబర్ N1576942 చుట్టుప్రక్కల ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది నెంబరుకు తెలుపగలరు.

సెల్: 9440148729

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజానగరం

యుటిఎఫ్ రూపొందించిన 'స్కూల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్' కరపత్రాలను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ రూస్సీ ఆవిష్కరించారు. ఎంఇఒలు రామన్న దొర, జ్యోతి ప్రసాద్‌కు తొలి కాపీలను అందించారు. రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ ఆవశ్యకత గురించి వివరించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయకర్, ఎ.షరీఫ్ మాట్లాడుతూ ఈ కరపత్రాలను ఉపాధ్యాయులు వారి గ్రామ పరిధిలో పాఠశాల ఎన్‌రోల్‌మెంట్‌కు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సిహెచ్.దయానిధి మాట్లాడుతూ జిల్లా శాఖ ఇచ్చిన కరపత్రాలను ఉపయోగించుకుని రాజానగరం మండల స్థాయిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడికెల రాజేశ్వరీదేవి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి మార్క్స్‌లిస్ట్ పోయినది

నిడదవోలు మండలం, పురుషోత్తపల్లి గ్రామ కాపురస్తుడను, యిమ్మణ్ణి లీల సాయి, తండ్రి: రామకృష్ణ అను నాయొక్క పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ లిస్ట్ ది.30-03-2025వ తేదీన పురుషోత్తపల్లి గ్రామం నుండి నిడదవోలు వస్తుండగా దారి మార్గంలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు.

యిమ్మణ్ణి లీల సాయి, తండ్రి: రామకృష్ణ

ఫోన్: 6300825899